హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నటి శ్రవంతి చోకరపు, నిర్వాహకుడు డొమినిక్

మాదాపూర్: ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం మూడ్రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి శ్రవంతి చోకరపు, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలను ఆకట్టుకునేలా ప్రత్యేక డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రముఖ డిజైనర్లు 350 మంది రూపొందించిన వస్త్రాభరణాలు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్స్, జువేలరీ యువతను ఆకట్టుకుంటున్నాయన్నారు. అంతర్జాతీయ నటి గీత బట్లాంకి, నటి ప్రియాంకచౌదరి పలువురు మోడల్స్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా మంగళవారం జ్యోతిరెడ్డి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. అర్చనమిశ్ర శిష్యబృందంచే కథక్ ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చీరలు, శ్రీకాళహస్తి చెక్కానం విగ్రహాలు, ఆర్టిఫీషియల్ జువేలరీ, మెటల్ క్రాఫ్ట్స్, పట్టు లంగాలు, బెడ్‌షీట్లు, రజాయి, లెదర్ చెప్పులు, ముత్యాల హారాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. కృషినగర్‌కాలనీ, జేపీనగర్ కాలనీలలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనులు చేపట్టే సమయంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ డీఈ దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, నాయకులు గంగాధర్‌రావు, రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఖాజాగూడ జంక్షన్‌ను మూసివేసిన దృశ్యం



ప్రతిపాదనలో ఉన్న రాడిసన్ హోటల్ జంక్షన్

ఐటీ కారిడార్‌లో జంక్షన్ల విస్తరణేదీ ?

- ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం
- వాహనాల రద్దీతో పలు జంక్షన్ల మూసివేత
- యూటర్న్‌లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వాహనదారులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు



ఖాజాగూడలో బారులు తీరిన వాహనాలు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ తిప్పలు అంతా ఇంతా కాదు. ఏ జంక్షన్లో చూసినా కిలోమీటరు పొడవునా వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టినా.. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జంక్షన్ల విస్తరణ ఊసే లేకపోవడంతో ప్రత్యామ్నాయ రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు వేసినా ఫలితం ఉండటం లేదు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ట్రాఫిక్ రద్దీ ఉన్న జంక్షన్లను విస్తరణ కోసం గత తొమ్మిదేళ్లుగా అనేకసార్లు ప్రతిపాదనలు రూపొందించారు. అవి కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జంక్షన్లు జాం...

- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపించే రీతిలో గత ప్రభుత్వం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టింది. మూడు రైల్వే అండర్ బ్రిడ్జిలు మాదాపూర్, హఫీజ్‌పేట్, నల్లగండ్లలో ఉండగా.. మరో మూడు అండర్‌పాస్‌లు ఉన్నాయి. 8 ఫ్లైఓవర్లు, ఒక కేబుల్ బ్రిడ్జితో వాహనాలు రాకపోకలు సజావుగా సాగుతున్నాయి.
- కొండాపూర్ నుంచి ఓఆర్ఆర్‌కు వెళ్లేందుకు మరో థర్డ్ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఉంది. దాదాపు 18 లింకు రోడ్లు ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉన్నా.. జంక్షన్ల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. నలుదిక్కుల నుంచి ఒక్కసారిగా వాహనాలు రావడంతో జంక్షన్లు జాం అవుతున్నాయి.
- గత వర్షాకాలంలో కిలోమీటరు ప్రయాణానికి గంటకు పైగా సమయం పట్టిన పరిస్థితిని వాహనదారులు ఎదుర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ, ఖాజాగూడ, సైబరాబాద్, బొటానికల్ గార్డెన్, గచ్చిబౌలి, గుల్మోహర్ పార్క్ జంక్షన్లలో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు అవస్థలకు గురౌతున్నారు.

జంక్షన్ల మూసివేత...

- షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. ఖాజాగూడ జంక్షన్ జామ్ కావడంతో బయోడైవర్సిటీ నుంచి వచ్చే వాహనాలు ఖాజాగూడ వైపు వెళ్లకుండా జంక్షన్ మూసివేశారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో జంక్షన్‌ను పూర్తిగా మూసివేశారు.
- నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ రోటరీ నుంచి వచ్చే వాహనాలు మెహిదీపట్నం వైపు వెళ్లాలన్నా, షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి వచ్చే వాహనాలు రాయదుర్గం వైపు వెళ్లాలన్నా.. ఖాజాగూడ జంక్షన్ దాటిన తర్వాత యూటర్న్ తీసుకోవాల్సి ఉంది. దీంతో ట్రాఫిక్‌రద్దీ పెరగడంతో మధ్యాహ్నం సమయంలోనూ వాహనాలు బారులుతీరాయి.
- కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ట్రాఫిక్ డైవర్షన్ ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. మాదాపూర్ నుంచి బయోడైవర్సిటీ వైపు వెళ్లకుండా మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్ జంక్షన్, అదే ఫ్లైఓవర్ కింద ఉన్న మరో జంక్షన్‌ను మూసివేశారు.
- వాహనాల తాకిడి పెరగడంతో ఒత్తిడి తగ్గించేందుకు తప్పని పరిస్థితుల్లో జంక్షన్లు మూసివేసి యూటర్న్‌ల ద్వారా కొంత ఉపశమనం కల్పిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు.
- జంక్షన్ల మూసివేత, యూటర్న్‌లతో ప్రయోగాలు చేసినా ట్రాఫిక్‌జామ్ మాత్రం తగ్గడం లేదు. జంక్షన్లను విస్తరిస్తే ట్రాఫిక్ సజావుగా సాగే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు ఎక్కడ ?

- జంక్షన్ల విస్తరణ కోసం ఐదేళ్ల క్రితం ట్రిపుల్ ఐటీ జంక్షన్ విస్తరణ, స్కైవాక్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండేళ్ల క్రితం గుల్మోహర్, మియాపూర్ జంక్షన్లను మోడల్ జంక్షన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రైవేట్ కంపెనీలు ముందుకొచ్చాయి.
- సీఎస్ఆర్‌లో భాగంగా జంక్షన్ల విస్తరణ చేస్తాయని అప్పటి అధికారులు ప్రకటించారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ ప్రతిపాదనలు కాగితాలకు పరిమితమైంది. రాడిసన్ హోటల్, బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ, సైబర్‌టవర్, ఖాజాగూడ జంక్షన్లను విస్తరించాల్సి ఉందని అనేకసార్లు ట్రాఫిక్ పోలీసులు సమన్వయ సమావేశంలో నివేదికలు ఇచ్చారు. జంక్షన్ల విస్తరణకు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం.
- ఐటీ కారిడార్‌లో రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్ఓబీలు ఉన్నా జంక్షన్లు అధ్వానంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. జంక్షన్ల విస్తరణకు కొత్త ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

ప్రతిపాదనలు లేవు..



వెస్ట్‌జోన్ పరిధిలో జంక్షన్ల విస్తరణకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు. గచ్చిబౌలి జంక్షన్ విస్తరణ ఫ్లైఓవర్ కారణంగా నిలిచిపోయింది. ఒక గుల్‌మోహర్ పార్కు కాలనీ జంక్షన్ చేపడతామన్న కంపెనీ పనులు చేసేందుకు నిరాకరించింది. తాజాగా కొత్త ప్రభుత్వం జంక్షన్ల విస్తరణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది. వారిచ్చే ఆదేశాల ప్రకారం భవిష్యత్తులో నిర్ణయాలు ఉంటాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి

ఎమ్మెల్యే గాంధీకి సన్మానం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఆరికెపూడి గాంధీని ఘనంగా సన్మానించారు. రామయ్యనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఆయన నివాసానికి మంగళవారం వెళ్లి శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ప్రజలు ఆశీర్వదించి హాట్రిక్ విజయాన్ని అందించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్ రైళ్ల సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– సీఎస్ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – కాకినాడ (సోమ, బుధ, శుక్ర)

(19.00 మంగళ, గురు, శనివారాలు)

- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– ఇండోర్ (ఆదివారం)

ఓటరు నమోదు, తొలగింపుపై అవగాహన

గచ్చిబౌలి: కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు, మరణించిన వారి ఓట్ల తొలగింపుపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో బీఎల్ఓ (బూత్ లెవల్ ఆఫీసర్)లకు ఓటరు లిస్టుపై డీఈలు రమేష్, విశాలాక్షి అవగాహన కల్పించారు. ఫారం–6 ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేయడం, ఫారం–7 ద్వారా మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. మరణించిన కుటుంబాల నుంచి సమ్మతి తీసుకుని, సంతకం సేకరించిన తర్వాతే ఓట్లను తొలగించాలని సూచించారు. ఫారం–8 ద్వారా అడ్రస్‌లు మారిన వారి ఓట్లను సరిదిద్దాలని, ఓటరు లిస్టు పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు.

గీతం పూర్వ విద్యార్థినికి గిన్నిస్ రికార్డు



గిన్నిస్ రికార్డు సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులు

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వ విద్యాలయం బీటెక్ పూర్వ విద్యార్థిని (2016–20) శివాలి జోహ్రి శ్రీవాస్తవ, ఆమె తల్లి కవిత జోహ్రి శ్రీవాస్తవ, తండ్రి అనిల్ శ్రీవాస్తవలు 14వ గిన్నిస్ రికార్డు సాధించి చరిత్ర సృష్టించారు. చేతితో తయారు చేసిన 2,700 కాగితం బొమ్మలను ఒకేచోట ఉంచిన ఈ కుటుంబం, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పారు. చిన్నపాటి రంగు కాగితాన్ని కూడా కళాత్మకంగా మలచగల నేర్పు శివాలీ కుటుంబానికి వరంగా మారింది. ఏకంగా విశ్వ యవనికపై విజయకేతనం ఎగురవేయడానికి తోడ్పడింది. ఏకంగా 14 గిన్నిస్ రికార్డులు, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులతో పాటు నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులు హైదరాబాద్‌లోని ఒకే కుటుంబానికి రావడం విశేషం. ఇంతకు మునుపు, శివాలి కుటుంబం హ్యాండ్ మేడ్ పేపర్‌తో రూపొందించిన 1,251 విభిన్న బొమ్మలను కొలువుతీర్చి తొలి గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. ఆ తరువాత 7,011 విభిన్న కాగితం పువ్వులను ప్రదర్శించి మలి రికార్డు, 2,111 విభిన్న బొమ్మలు, 3,501 ఆరెగామి వేల్స్, 2,100 ఆరెగామి పెంగ్విన్ 6,132 ఆరెగామి సిట్రస్ (నిమ్మ తొన)లు, 6,100 ఆరెగామి వేల్స్, 2,500 ఆరెగామి పెంగ్విన్, 1,451 ఆరెగామి మాప్లీలు, 2,200 క్విల్లింగ్ డాల్స్, 9,200 ఆరెగామి ఫిష్, 1,993 ఆరెగామి మాప్లీ లీవ్సను ప్రదర్శనకు ఉంచి ఇప్పటివరకు 13 గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న విషయం విధితమే. మొత్తం 14 గిన్నిస్ రికార్డులను సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులను గీతం హైదరాబాద్ అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్ఆర్ వర్మ, బీటెక్ తొలి ఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ త్రినాథరావు, గణిత విభాగం అధ్యాపకు డు డాక్టర్ మల్లికార్జున్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బస్ మార్గంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్ప మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సు మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు పనులను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సుందరీకరణ పనుల పరిశీలన

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ పరిధిలోని బక్షికుంట చెరువు సుందరీకరణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పరిశీలించారు. మంగళవారం ఫినమ్‌పీపుల్ ఐటీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో బైరీ సంస్థ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. బక్షికుంట దశ మారిందని, ఎన్నో ఏళ్ల సమస్య ఫీనమ్ సంస్థ చొరవతో తీరిందన్నారు. మురికికూపంలా ఉన్న చెరువు స్వచ్ఛమైన నీటితో తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. సీఎస్ఆర్ నిధులతో తీర్చిదిద్దిన ఫీనమ్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. చెరువు చుట్టూరా పచ్చదనాన్ని పెంచి ఆహ్లాద వాతావరణం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. చెరువు కట్టను పటిష్టం చేయడంతో పాటు డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చుట్టూరా మురుగునీటి కాల్వ నిర్మాణం చేస్తామన్నారు. చెరువు అలుగు మరమ్మతులు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. ఫినమ్ పీపుల్ ఐటీ సంస్థ ప్రతినిధి చైతన్య, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



బక్షికుంట సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు



సమీక్షా సమావేశంలో వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మియాపూర్: నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని చందానగర్ సర్కిల్ –21 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్ తెలిపారు. మియాపూర్‌లోని శ్రీరంగపురంకాలనీ వద్ద జేపీనగర్ ప్రధానరోడ్డులో అనుమతులు లేకుండా చేపట్టిన కమర్షియల్ షెడ్డు నిర్మాణాన్ని చందానగర్ సర్కిల్ – 21 టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతులు లేని నిర్మాణాలపై..

గచ్చిబౌలి: అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో అనుమతి నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ అనుమతి లేకుండా వేసిన అదనపు అంతస్తుల కూల్చివేతపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు నోటీసులిచ్చిన అక్రమ నిర్మాణాల పరిస్థితిపై టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ ఆఫీసర్ సురేష్, వెస్ట్ జోనల్ సీపీ మల్లికార్జున్, న్యాక్ ఇంజనీర్లు, ఏసీపీలు, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

విడతలవారీగా గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: ప్రణాళికబద్ధంగా గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే హాజరు

ఇంద్రేశం పరిధిలోని పీఎస్ఆర్ కాలనీలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ నర్సింహులు, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివారెడ్డి, సీనియర్ నాయకులు బండి శంకర్, మాణిక్‌రెడ్డి, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ఇక్రిసాట్ ప్రతినిధులు

ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంఏర్పాటుకు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గానికి ఇటీవల మంజూరైన ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో వివిధ కార్యాలయాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో తుది నిర్ణయం తీసుకొని కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన వివిధ భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఎండీ ముబారక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బొల్లారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి కు ముబారక్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల బీఎల్ఓలకు మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ అధికారులు చంద్రారెడ్డి, మోగిబాబు రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డైరెక్టర్ ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో మహిళల, పురుషుల కరాటే క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికైన క్రీడాకారులు జనవరి 16 నుంచి 20 వరకు ఎన్ఎన్‌సీటీ యూనివర్సిటీ, భూపాల్‌లో జరిగే తుది పోటీల్లో పాల్గొనున్నారు. వీరికి కరాటే కోచ్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎన్నుకున్నారు.

హ్యాండ్ బాల్ సౌత్‌జోన్ టీమ్ ఎంపిక ...

మహిళా హ్యాండ్ బాల్ సౌత్ జోన్ టీమ్ మంగళవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిలింగ్ డా. ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో మహిళా హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలోని మహిళా క్రీడాకారులు ఈ ఎంపికకు పోటీపడ్డారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10 నుంచి 14 వరకు పెరియార్ యూనివర్సిటీ సేలంలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో సీమర్ ఐటీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రావు, జేఎన్‌టీయూ ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ క్రీడాకారుల ఎంపికలో పాల్గొన్నారు.

అజ్మీర్ షరీఫ్‌కు ఎమ్మెల్యే చాదర్ సమర్పణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మంగళవారం అజ్మీర్ షరీఫ్ దర్గాని దర్శించుకున్నారు. అజ్మీర్ షరీఫ్ బాబాకు చాదర్‌ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, దొడ్ల వెంకటేష్‌గౌడ్, పండాల సతీష్‌గౌడ్ మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు, మాధవరం రంగారావు, శ్రీహరి, మేడ్చల్‌జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.